# గడువు మూడు రోజులే




**పెద్దపల్లి–నవభూమి:** వచ్చే ఏడాది మార్చి చివరలో జరగనున్న ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు హక్కు నమోదు కోసం ఇంకా మూడు రోజులే మిగిలి ఉంది. ఈనెల ఆరో తేదీన గడువు ముగియనున్నది. ఓటరు నమోదు చేసుకునేందుకు పట్టభద్రులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. గతంలో పట్టభద్రులుగా నమోదు చేసుకున్న ఓటర్లు సైతం మళ్లీ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని చెప్పడంతో కొంత మంది ఓటర్లు సర్టిఫికెట్లు లభ్యంకాక నమోదు చేసుకోలేక పోతున్నారు. అలాగే వివిధ ఉద్యోగాల్లో కొలువుదీరిన ఉద్యోగులు, వివిధ ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, నిరుద్యోగులు నేరుగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవడానికి ముందుకు రావడం లేదు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా ఉన్న టి జీవన్ రెడ్డి, రఘోత్తంరెడ్డిల పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29వ తేదీతో ముగియనున్నది. ఆలోపు ఎన్నికలు నిర్వహించేందుకు భారత ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తున్నది. అందులో భాగంగా కొత్త ఓటర్ల నమోదుకు సెప్టెంబర్ 30వ తేదీ నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నది. గడిచిన ఎన్నికల నాటికి పట్టభద్రుల ఓటర్లు 1,96,321 మంది ఉండగా, ఉపాధ్యాయ ఓటర్లు 21,000 మంది వరకు ఉన్నారు. 2022 నవంబరు నాటికి డిగ్రీ పూర్తి చేసిన వారు ఎవరైనా ఆన్‌లైన్ ద్వారా గానీ, సంబంధిత కార్యాలయాల్లో గానీ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని ఎన్నికల సంఘం ప్రకటించింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం గతంలో కేవలం ప్రభుత్వ పాఠశాలలు కళాశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు మాత్రమే ఓటు హక్కు ఉండేది. అందులో ఎస్జీటీలకు ఓటు హక్కు లేదు. ప్రస్తుతం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందేందుకు గాను ప్రభుత్వ విద్యాలయాల్లోనే కాకుండా ప్రైవేట్ విద్యాలయాల్లో పనిచేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులకు కూడా అవకాశం కల్పించారు. మూడేళ్ల నుంచి పనిచేస్తున్న వారై ఉండాలని పేర్కొన్నారు. దీంతో గతంలో కంటే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లు పెరిగే అవకాశాలు ఉన్నాయి. కానీ పట్టభద్రుల ఓటర్ల సంఖ్య గతంలో కంటే కొంత మాత్రమే పెరగనున్నది. వాస్తవానికి పట్టభద్రుల శాసనమండలి పరిధిలో సుమారు 10 లక్షలకు పైగా డిగ్రీలు, పీజీలు, ఇంజినీరింగ్, డాక్టర్, తదితర డిగ్రీ సంబంధ కోర్సులు చదివి ఉన్నారు. ఓటు హక్కు పొందడానికి మాత్రం పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఓటు హక్కు నమోదు ప్రక్రియపై జిల్లా అధికార యంత్రాంగం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లేదు. నమోదు గురించి ప్రసార మాధ్యమాల ద్వారా కూడా ప్రచారం నిర్వహించడం లేదు. దీంతో ఓటర్ల నమోదు ప్రక్రియ నత్తనడకన సాగుతున్నది. ఓటర్ల సంఖ్య పెంచేందుకు...పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నెల రోజుల నుంచే హడావుడి మొదలైంది. నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల కంటే కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి పోటీచేసే ఆశావహుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నది. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి నరేందర్ రెడ్డి, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ పులి ప్రసన్న హరికృష్ణ, డాక్టర్ హరికృష్ణ రెడ్డి, ముస్తాక్ అహ్మద్ తాము పోటీలో ఉంటున్నామని ఇప్పటికే ప్రకటించారు. వీళ్లే కాకుండా బీజేపీ నుంచి జాతీయ నాయకుడు పోల్సాని సుగుణాకర్‌రావు, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ రావు, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నుంచి మాజీ మేయర్ రవీందర్ సింగ్, టీఎస్టీఎస్ మాజీ చైర్మన్ డాక్టర్ చిరుమల్ల రాకేష్, తదితరులు పోటీ చేస్తామని తమకు మద్దతు ఇవ్వాలని పార్టీ అధిష్ఠానం నేతలను కోరుతున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ప్రస్తుత ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి, మానేరు విద్యాసంస్థల కరస్పాండెంట్ అనంతరెడ్డి, తదితరులు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాము పోటీ చేయనున్నామని తమకు మద్దతునిచ్చి గెలిపించాలని వారు సైతం కోరుతూ వస్తున్నారు. అంతేగాకుండా పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కోసం అర్హులైన వాళ్లు దరఖాస్తు చేసుకోవాలని నమోదు ఫారాలను పంపిణీ చేస్తున్నారు. అలాగే కొంతమంది ఆయా జిల్లాల్లో నేరుగా కార్యాలయాలను ఓపెన్ చేసి దరఖాస్తులను స్వీకరించి సంబంధిత అధికారులకు అందజేస్తున్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయుల సెల్‌ఫోన్ నంబర్లను సేకరించి ఓటు హక్కు కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సోషల్ మీడియా వేదికలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్, ఎక్స్‌ను ఉపయోగించుకొని అవగాహన కల్పిస్తున్నారు. ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్ ద్వారా లింకులు పంపుతున్నారు. వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈనెల ఆరో తేదీ వరకు గడువు ఉండగా, ఆ తర్వాత సంబంధిత అధికారులు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హత కలిగిన ఓటర్ల తుది జాబితాను ప్రకటించనున్నారు. గడువు మూడు రోజులే మిగిలి ఉండడంతో ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం ఓటు హక్కు నమోదు కోసం విస్తృతంగా ప్రచారం చేయాలని పోటీ చేసే అభ్యర్థులు కోరుతున్నారు.

# వరి గోస...







నవభూమి
కరీంనగర్
అనుబంధం
06 నవంబర్,2024 బుధవారం పేజీలు:2
www.epaper.navabhoomi.in

## ధాన్యం కొనుగోళ్లను

# వేగవంతం చేయండి



**ధర్మారం–నవభూమి:** ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. ధర్మారం మండలంలోని దొంగతుర్తి, ?ధర్మారం, మల్లాపూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల కోసం ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు ధాన్యన్ని ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు, అధికారులు ?ధాన్యాన్ని మద్దతు ధరపై వేగవంతంగా కొనుగోలు చేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోతల సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. పంట కోసే సమయంలో హార్వేస్టర్ల వినియోగం, వాటి జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. రైతుల వద్ద నుంచి పూర్తిస్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే మిల్లులకు, గోదాములకు ?ధాన్యాన్ని తరలించాలని, ఇందుకోసం వాహనాల కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, జిల్లా సహకార అధికారి శ్రీమాల, తహసీల్దార్ మహ్మద్ ఆరీఫ్ ఉద్దీన్, ఎంపీడీవో ప్రవీణ్, ఏఎంసీ చైర్మన్ రూప్లానాయక్, ప్యాక్స్ చైర్మెన్ నోముల నర్సింహారెడ్డి, ధర్మారం మండల వ్యవసాయ అధికారి బండ రాజు, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# భవిష్యత్తు సౌర విద్యుత్తు శక్తిదే!



## అసంపూర్తి రహదారులతో అవస్థలు



**కరీంనగర్-నవభూమి:** నగరంలోని తిరుమల్‌నగర్ ప్రాంతవాసులు రెండేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. స్మార్ట్‌సిటీలో వరదకాలువ నిర్మాణ పనులు ప్రారంభించినప్పటి నుంచి మొదలైన కష్టాలు ఇప్పటికీ తీరడంలేదు. కొత్తగా రహదారులు వేస్తామని చెప్పి వీధులన్నీ తవ్వి వదిలేశారు. ఆ పనులు పూర్తి చేయకుండా వదిలేశారు. రోడ్డుకు, కాలువ పైకప్పు ఎత్తుగా ఉండటంతో రాకపోకలు సాగించే సమయంలో అవస్థలు పడాల్సి వస్తుంది. తవ్విన రోడ్లను పూర్తి చేయాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

## కరీంనగర్ సిటిజన్ కాలనీలో మౌలిక వసతుల లేమి..

### స్థానికులకు నరకయాతన



**కరీంనగర్-నవభూమి:** కరీంనగర్ నగరంలో ఉన్న సిటిజన్ కాలనీ వాసులు తాము రోడ్లు, మురుగు దొడ్లు, త్రాగు నీటి వసతి మొదలగు కనీస మౌలిక సదుపాయాలు లేకుండా తీవ్ర ఇబ్బందులను ఎటుర్కొంటున్నామని నాయకుల ముందు వాపోయారు. సింగరేణి ఉద్యోగులు, గల్ఫ్ ప్రవాసీయులు, ప్రభుత్వ ఉద్యోగులు ప్రధానంగా ఈ కాలనీలో నివాసముంటున్నారు. ఆదివారం రాత్రి సిటిజన్ కాలనీ రోడ్డు నెంబర్ రెండు పై సిటిజన్ కాలనీ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో కాలనీ వాసులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. దుబాయి నుండి హైదరాబాద్‌కు మూడున్నర గంటలలో వచ్చే తమకు,తమ ఇళ్ళలో అత్యవసర స్థితులలో వర్షకాలంలో అంబులెన్సు రావాడానికి గంటన్నరకు పైగా సమయం పడుతుందని కాలనీ వాసులు వాపోయారు. ఇటీవల ఒక భవన నిర్మాణం సందర్భంగా షార్ట్ సర్క్యూట్ జరిగి ఒకరు గాయపడితే అంబులెన్స్ రావడానికి రోడ్లు లేని కారణంగా వర్షపు నీరు ఆగడంతో గంటన్నరకు పైగా సమయం పట్టిందని సిటిజన్ కాలనీ వెల్ఫేర్ కమీటి అధ్యక్షుడు మొహమ్మద్ ఫేరోజ్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అదే విధంగా, ప్రధాన రహదారికి చేరుకునే వరకు కాలనీకి చెందిన ఒక మహిళకు గర్భస్రావం జరిగిన విషయాన్ని కూడా కమిటీ నాయకుడు మొహమ్మద్ అతీఫ్ ప్రస్తావించారు.అమెరికాలోని నెబ్రాస్కా గవర్నర్ నివాసంలో దీపావళి సంబరాలు భౌతికంగా కరీంనగర్ నగరంలో ఉన్నప్పటికీ సాంకేతికంగా తమను బొమ్మకల్ గ్రామ పంచాయితీ పరిధి వాసులుగా పేర్కొంటూ కనీస సదుపాయాలను సైతం దూరం చేస్తున్నారని కాలనీ వాసులు కార్యక్రమంలో ఫిర్యాదు చేసారు.సిటిజన్ కాలనీ శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, తమ పరధిలో వీలయినంత వరకు అన్ని రకాల సదుపాయాలను సమకూర్చామని కరీంనగర్ శాసన సభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, బొమ్మకల్ మాజీ సర్పంచి అయిన పురుమల్ల శ్రీనివాస్ పేర్కొంటూ వీలయినంత త్వరగా కాలనీలో రోడ్ల నిర్మాణానికి తన వంతుగా కృషి చేస్తానని చెప్పారు.కాలనీలో కీలకమైన రోడ్డు నెంబర్ 2 రోడ్డు నిర్మాణానికి, కూడలిలో ప్రత్యేక లైట్ల ఏర్పాటుకు తాను కృషి చేస్తానని నరేందర్ రెడ్డి హామినిచ్చారు.యువకులు, విద్యాధికులు అధికృతగా ఉన్న సిటిజన్ కాలనీ వెల్ఫేర్ కమిటీ ఈ ప్రాంతాభివృద్ధి కోసం కులమత, రాజకీయాలకు అతీతంగా కృషి చేస్తుందని కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా జరిగిన విందు కార్యక్రమంలో కాలనీ వాసులతో పాటు పలువురు ప్రముఖులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మజ్లీస్ పార్టీ నగర అధ్యక్షుడు అహ్మద్ తదితరులు పాల్గొన్నట్లుగా నిర్వహకులు తెలిపారు.

# భవిష్యత్తు సౌర విద్యుత్తు శక్తిదే!



**కరీంనగర్-నవభూమి:** ముందుచూపుతో రెడ్డీస్ ఫౌండేషన్ యువతకు శిక్షణ సౌర పలకల బిగింపు, విద్యుత్తు ఉత్పత్తిపై శిక్షణ పొందుతున్న యువకులు బొగ్గు, నీటి ద్వారా విద్యుత్తు ఉత్పత్తి ఖర్చుతో కూడుకున్న పని.అంతేకాకుండా వాటి నిల్వలు సైతం తగ్గుతున్నాయి. సహజ వనరుల వినియోగాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయి. ఇప్పటికే ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. రానున్న రోజుల్లో సోలార్ వినియోగం మరింత పెరిగి.. భారీగా సాంకేతిక నిపుణులు అవసరమవుతారు. దీనిని దృష్టిలో పెట్టుకొని తెలంగాణలో మొదటిసారి సోలార్‌పై యువతకు శిక్షణ ఇవ్వడానికి కరీంనగర్‌ను ఎంపిక చేసింది రెడ్డీస్ ఫౌండేషన్. సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు.రాణించడం సులువే సౌరశక్తి ప్యానళ్ల బిగింపు, కంప్యూటర్ పరిజ్ఞానం, నైపుణ్యాల పెంపు, తదితర అంశాలపై మూడు నెలలపాటు ఉచితంగా శిక్షణ ఇస్తున్నాం. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి రాష్ట్ర వ్యాప్తంగా పలు సంస్థల్లో ఉద్యోగాలు వచ్చేలా చూస్తున్నాం. మహిళలు కూడా శిక్షణ పొందారు.తిరుపతి, రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధి ఉపాధి అవకాశాలు పెరుగుతాయి రానున్న రోజుల్లో సౌర విద్యుత్తుకు సంబంధించి.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. నేను ఐటీఐ ఎలక్ట్రిక్ కోర్సు పూర్తి చేశా. రెడ్డీస్ ఫౌండేషన్ వారు శిక్షణ ఇస్తున్నారని తెలుసుకొని సంప్రదించాను. నా అర్హతలు చూసి నన్ను చేర్చుకున్నారు. నెల రోజులుగా శిక్షణ తీసుకుంటున్నాను.సాగర్, కరీంనగర్ నైపుణ్యాలు నేర్పుతున్నారు శిక్షణలో సోలార్ ప్యానల్ బిగింపు, డీసీ, ఏసీ అంటే ఏమిటో నేర్చుకున్నా. శిక్షణ బాగుంది. సౌర శక్తి మెలకువలతోపాటు కంప్యూటర్, భావ ప్రకటన నైపుణ్యాలూ నేర్పుతున్నారు. శిక్షణ తరువాత సంస్థనే ఉద్యోగం ఇప్పించడం సంతోషించదగిన విషయం. గణేష్(ఐటీఐ), మల్లాపూర్ అవగాహన కల్పిస్తున్నారు రెడ్డీస్ ఫౌండేషన్ సోలార్‌పై ఇస్తున్న శిక్షణ గురించి తెలుసుకొని వచ్చాను. సౌర ప్యానళ్లు బిగించడం తదితర విషయాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇంటికి విద్యుత్తు వాడుకోగా మిగిలింది సబ్‌స్టేషన్‌కు ఎలా వెళ్తుందనేది తెలుసుకున్నా. ఆకాష్ (డిప్లొమో), మానకొండూర్ 3 నెలలపాటు తర్ఫీదు..మూడు నెలలపాటు సాగే ఈ శిక్షణలో సోలార్ ప్యానళ్ల బిగింపు, డీసీ నుంచి ఏసీకి విద్యుత్తు ప్రసరణ తదితర అంశాలపై నిపుణులతో శిక్షణ ఇస్తున్నారు. రెండు నెలలపాటు థియరీ, ప్రాక్టికల్ శిక్షణ ఇస్తుండగా మూడో నెలలో ఉద్యోగం కలిపిస్తారు.అర్హులు ఎవరంటే? ఐటీఐ, డిప్లొమా, బీటెక్ (మెకానికల్, ఎలక్ట్రీషియన్) చదివినవారు శిక్షణ తీసుకోవడానికి అర్హులు. ఆసక్తి గలవారు కరీంనగర్‌లో ఉన్న సదరు సంస్థ కార్యాలయంలో పదోతరగతి, ఇతర విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వచ్చిన దరఖాస్తుల నుంచి వారి వివరాలు సేకరించి రూ.2 లక్షలలోపు ఆదాయం ఉన్న విద్యార్థులను ఈ శిక్షణకు ఎంపిక చేస్తారు.

# వరి గోస...



**కరీంనగర్-నవభూమి:** రామడుగు మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మహేందర్‌రెడ్డి అనే రైతు 14 ఎకరాల్లో వరిసాగు చేశాడు. 15 రోజుల క్రితమే వరి కోతలు పూర్తిచేసుకున్నాడు. కొనుగోలు కేంద్రాలు తెరిచారు కానీ కొనుగోళ్ళు మాత్రం ప్రారంభించలేదు. ఎప్పుడు కొంటారో ఎవరూ చెప్పలేని పరిస్థితి. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు 2,320రూపాయలు మద్దతు ధర ఉండగా ఆయన 1,930 రూపాయలకే చొప్పదండిలోని రైసుమిల్లుకు అమ్ముకున్నాడు. క్వింటాల్‌కు 390 రూపాయల నష్టంతో 400 క్వింటాళ్ల ధాన్యాన్ని అమ్ముకుని 1.56 లక్షల రూపాయలు నష్టపోయాడు.చొప్పదండికి చెందిన రైతు గుర్రం శ్రీనివాస్‌రెడ్డి నాలుగు ఎకరాల్లో వరిసాగు చేశాడు. 15 రోజుల క్రితం వరి కోశాడు. వర్షం పడడంతో ట్రాక్ హార్వెస్టర్‌తో పొలం కోయించాల్సి వచ్చి 10వేల రూపాయలకు బదులు 18 వేల రూపాయల ఖర్చయింది. ధాన్యాన్ని తీసుకవచ్చి వెదురుగట్ట సమీపంలోని కొనుగోలు కేంద్రంలో పోశాడు. ఎప్పుడు వర్షం వస్తుందో.. కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్లు అందుబాటులో లేవు. ఎండిన ధాన్యం తడిసిపోతుందని ఆందోళన పడి 14 టార్పాలిన్లను రోజుకు 280 రూపాయలకు కిరాయికి తీసుకొని వచ్చి ధాన్యంపై రాత్రిపూట కప్పుతున్నాడు. ఇప్పటికే టార్పాలిన్లకు నాలుగు వేల రూపాయల కిరాయి అయింది. ధాన్యం ఆరబెడుతున్న సమయంలోనే రెండు సార్లు వర్షం వచ్చి కొంత మేరకు తడిసింది. ఆయన వంద క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో పోసి కొనుగోళ్ళు ఎప్పుడు ప్రారంభమవుతాయోనని ఎదురుచూస్తూ కేంద్రంలోనే గడుపుతున్నాడు.హుజురాబాద్ మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన రెడ్డబోయిన లావణ్య భర్త తొమ్మిది నెలల క్రితం చనిపోయాడు. కుటుంబ బాధ్యతను తీసుకుని తనకున్న భూమిలో వ్యవసాయ చేస్తోంది. కోతలు పూర్తి చేసుకొని 40 క్వింటాళ్ల వడ్లను కొనుగోలు కేంద్రానికి తరలించింది. ఆ పంట అమ్మి అప్పుకట్టాల్సి ఉన్నది. 10 రోజులుగా ధాన్యాన్ని కాపాడుకుంటూ కొనుగోలు కేంద్రంలోనే పడిగాపులు పడుతున్నది. వర్షం పడితే ధాన్యం తడిసి మద్దతు ధర వస్తుందో రాదోనని ఆందోళన చెందుతున్నది.జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో వరి కోతలు ప్రారంభమై 40 రోజులు దాటింది. కుప్పలు, తెప్పలుగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చి చేరుతోంది. ప్రతి గ్రామంలోనూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గడిచిన పదేళ్లుగా వరి ధాన్యాన్ని కొంటుతున్నారు. ఈసారి కూడా అదే విధంగా అంతా సజావుగా సాగిపోతుందనుకున్న రైతులకు తీరని సమస్య వచ్చి పడింది. రైసు మిల్లర్లకు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య ఒప్పందం కుదరక పోవడం ధాన్యం కొనుగోళ్లకు ఆటంకంగా మారింది.ధాన్యం నిల్వ ఎక్కడ? కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొన్న వెంటనే దానిని నిర్దేశించిన మిల్లులకు తరలించాల్సి ఉంటుంది. మిల్లర్లు ఈ ధాన్యాన్ని బియ్యంగా మార్చి కొంత ప్రభుత్వానికి చెల్లించి, మరికొంత మార్కెట్‌కు తరలించి అమ్ముకుని వ్యాపారంచేసుకుంటున్నారు. చాలా మంది మిల్లర్లకు ఇది పెట్టుబడి లేని వ్యాపారంగా మారింది. ప్రభుత్వం ఫెనాల్టీ విధించినా సకాలంలో బియ్యం చెల్లించని వారు ఎందరో ఉన్నారు. ఈ పరిస్థితిని నివారించడానికి ఆయా మిల్లుల మిల్లింగ్ కెపాసిటీని బట్టి దానికి ఎంత ధాన్యం కేటాయించాలో నిర్ణయించి ఆ ధాన్యానికి బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలని, కొంత సొమ్ము డిపాజిట్ చేయాలని ప్రభుత్వం షరతులు విధించింది. దీనికి మిల్లర్లు అంగీకరించకపోవడంతో ధాన్యం కొనుగోలు చేస్తే ఎక్కడ నిలువ చేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొన్నది. కొనుగోళ్ల ప్రారంభించకపోవడంతో కేంద్రాల్లో ధాన్యం పేరుకుపోయింది. ఇప్పుడిప్పుడే కోతలు పూర్తి చేసుకుంటున్న రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకవచ్చే అవకాశం లేక ఎక్కడ స్థలం ఉంటే అక్కడ ఆరబోస్తున్నారు. ప్రభుత్వానికి మిల్లర్లకు మధ్య 15రోజులుగా చర్చలైతే జరుగుతున్నాయి కానీ పరిష్కారం మాత్రం లభించడం లేదు. దీంతో రైతుల్లో ఆందోళన పెరిగి మద్దతు ధర రాకున్నా ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం అమ్ముకోవడానికి సిద్ధపడుతున్నారు.